సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



రైతు బాగుంటేనే..

జెడ్పీ సర్వసభ్య సమావేశం అర్థవంతంగా జరిగింది. వలు సమస్యలపై చర్చ నిర్వహించారు. - 8లో



ఫ్రేమ్‌లూమ్‌తో చీరలు..

పొందూరు ఖాదీ పరిశ్రమను అధికారులు సందర్శించారు. కాలానికి తగ్గట్టు అప్‌డేట్ కావాలన్నారు. - 8లో

దరఖాస్తులకు గడువు పెంపు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మసిస్టులు, ఎఫ్‌ఎన్‌ఓల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు ఒక రోజు గడువును పెంచినట్లు జిల్లా వైద్య శాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 19 మంగళవారం నాటికి పంపించాలన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

న్యూస్‌రీల్

ఇన్‌స్టెంట్ పరీక్షకు 155 మంది హాజరు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో ఒక్క సబ్జెక్టులో ఫెయిలైన విద్యార్థులకు ఇన్‌స్టెంట్ పరీక్ష శనివారం నిర్వహించారు. వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ పరీక్ష కేంద్రంగా ఈ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. వర్సిటీ పరిధిలో ఇన్‌స్టెంట్‌కు అర్హులు 163 మంది ఉండగా, జ్ఞానభూమిలో 155 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఈ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 20వ తేదీన ఈ పరీక్షల ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ పరీక్షలు పర్యవేక్షించారు.

ముగిసిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శుల మూడో విడత శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. మూడు విడతలు పూర్తి కాగా నాలుగో విడత శిక్షణ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. గ్రామ కార్యదర్శులకు పంచాయతీ రాజ్ చట్టాలు, లేఅవుట్‌ల నిబంధనలపై ఆరు రోజుల శిక్షణ ఇస్తున్నారు. నాలుగు రోజులు శిక్షణ తరగతులు, రెండు రోజులు క్షేత్ర స్థాయి పర్యటనలు అమలు చేస్తున్నారు. ముగింపు కార్యక్రమంలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.


భక్తుల వసతి గదుల నిర్మాణాలకు రూ.4 లక్షలు విరాళం



విరాళాన్ని ఈఓకు అందజేస్తున్న దాత కిరణ్ తదితరులు, పక్కనే మండవిల్లి రవి

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల కోసం నిర్మించనున్న వసతి గదుల నిర్మాణాలకు స్థానిక వ్యాపారి నారాయణశెట్టి వెంకట రవికాంత్, నారాయణశెట్టి కిరణ్ కుమార్‌లు రూ.4 లక్షల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ మేరకు శనివారం దాతలు ఆలయంలో స్వామిని దర్శనం చేసుకున్న అనంతరం ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి సమక్షంలో ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు విరాళ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ విరాళాలను ఇచ్చిన దాతలందరికీ రథసప్తమి వంటి పర్వదినాల్లో విశిష్ట దర్శనాలకు డోనర్ పాసులను ఇవ్వనున్నట్లుగా ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చక సిబ్బంది నేతేటి హరిప్రసాద్ శర్మ, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూసెంట్రల్ స్కూల్ ఆవరణలో తయారు చేసిన మట్టి గణపతి ప్రతిమలను ప్రదర్శిస్తున్న వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు





చిట్టి చేతుల్లో ఒదిగిన మట్టి గణపయ్య

- 'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల తయారీపై ఉచిత శిక్షణ శిబిరం
- తరలివచ్చిన పలు పాఠశాలల విద్యార్థులు



బహుమతులు సాధించిన విద్యార్థులతో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త నిర్వహణలో 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలో ఉన్న న్యూసెంట్రల్ స్కూల్ వేదికగా శనివారం మట్టి గణేశుని తయారీపై ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరుకావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా అద్భుతంగా మట్టి గణపతి ప్రతిమలను తయారుచేసిన వారికి బహుమతులను అందించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎ.రామారావు నాయుడు, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్‌లు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. మట్టి గణపయ్యల తయారీకి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన డ్రాయింగ్ టీచర్ తోట ప్రసాద్‌బాబు (జెడ్పీహెచ్‌స్కూల్ వప్పంగి) అధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.



మట్టి గణపయ్య తయారీని వివరిస్తున్న ఆర్ట్ టీచర్ ప్రసాద్‌బాబు

విజేతలు వీరే..

మట్టి విగ్రహాల తయారీలో ప్రతిభ చూపిన విద్యార్థుల్లో మొదటిస్థానంలో పి.కావ్య, 8వ తరగతి (న్యూ సెంట్రల్ స్కూల్ శ్రీకాకుళం), ద్వితీయ స్థానంలో ఎస్.చరణ్‌తేజ, 7వ తరగతి (శ్రీ సాయివిద్యామందిర్ స్కూల్ శ్రీకాకుళం), తృతీయ స్థానంలో కె.నిహారిక, (శ్రీచైతన్య స్కూల్ శ్రీకాకుళం) నిలిచారు.

వీరితోపాటు కన్సోలేషన్ బహుమతులను కె.నితిన్‌కుమార్, 10వ తరగతి (నవయుగ స్కూల్ శ్రీకాకుళం), జి.ఆకాష్, 10వ తరగతి (ఆక్స్‌ఫర్డ్ స్కూల్ శ్రీకాకుళం), డి.రేష్మత, 8వ తరగతి (గీతాంజలి స్కూల్), డబ్ల్యూవీఎస్ నవీన్ మణికంఠ, 9వ తరగతి (శర్వాణి విద్యాలయం స్కూల్), ఎ.రంజిత్‌కుమార్, 8వ తరగతి (న్యూ సెంట్రల్ స్కూల్ శ్రీకాకుళం), టి.నితిన్‌రాజ్, 9వ తరగతి(శ్రీచైతన్య స్కూల్ శ్రీకాకుళం), టి.వినయ్, 8వ తరగతి (శ్రీ సాయి విద్యామందిర్ స్కూల్ శ్రీకాకుళం) అందుకున్నారు.

మట్టి విగ్రహాలనే వాడాలి

కార్యక్రమాన్ని డీఈఓ కె.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన డీఈఓ అనంతరం మాట్లాడారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థుల చిట్టి చేతుల్లో మట్టి గణేశుడి ప్రతిమలు ఆవిష్కృతం కావడం గొప్ప విషయమన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జగన్మోహనరావు మాట్లాడుతూ 'సాక్షి' మీడియా గత కొన్నేళ్లగా చేపడుతున్న యజ్ఞాన్ని కీర్తించారు. విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యతను చిన్నారులకు వివరించారు. 'సాక్షి' బ్రాంచి మేనేజర్ బీజేజీవీఆర్ స్వామి మాట్లాడుతూ చిన్నారుల మట్టి గణపయ్య తయారీ శిక్షణ కార్యక్రమం ఉద్దేశాన్ని, ఏర్పాట్లను వివరించారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, బ్యూరో ఇన్‌చార్జ్ కె.శివశంకర్, ఎడిషన్ ఇన్‌చార్జ్ కె.రాజా, ఏడీవీటీ మేనేజర్ జగదీష్, ఐటీ ఇన్‌చార్జ్ కామేశ్వరరావు, సాక్షి మీడియా వివిధ విభాగాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసక్తిగా మట్టి గణపతిని తయారు చేస్తున్న విద్యార్థిని



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, బలివాడ మల్లేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు

మార్పు కోసం తపన



ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు నడుం బిగించిన సాక్షి మీడియా యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు. మా న్యూసెంట్రల్ స్కూల్ వేదికగా మట్టి గణేశుని తయారీ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉంది. పర్యావరణ హితం కోసం విద్యార్థి దశ నుంచే మార్పు రావాలి.

– పోలుమహంతి శ్రీకాంత్, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్

బీఈడ్ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం విడుదల చేశారు. ఈ పరీక్షలు ఈ ఏడాది జూలైలో నిర్వహించారు. 929 మంది హాజరు కాగా, 884 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 95.16 నమోదైంది. రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సాక్షి మీడియాకు ధన్యవాదాలు



ప్రతి ఒక్కరూ మట్టి గణపతి ప్రతిమలను వాడాలి. ఆరోగ్యవంతమైన శ్రీకాకుళం నగరాన్ని తీర్చిదిద్దాలనేది మా అభిలాష. అందుకు 'సాక్షి' తమ వంతుగా సహకారాన్ని అందించేందుకు గత కొన్నేళ్ల నుంచి ముందుకు రావడం అభినందనీయం. ప్రజలందరి తరపున ధన్యవాదాలు చెబుతున్నాను.

– చల్లా ఓబులేసు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

కాలుష్య రహితంగా వేడుక చేసుకోండి



కాలుష్య రహితంగా వినాయక చవితి వేడుకలు చేసుకోవాలి. శ్రీకాకుళం నగరంతోపాటు పట్టణాలు, గ్రామాల్లోనూ ప్రజల్లో చైతన్యం నింపాం. మట్టితో తయారుచేసిన ప్రతిమలు మాత్రమే నిమజ్జనం చేసే సమయంలో తొందరగా నీటిలో కలిసిపోతాయి. రంగులతో కూడిన బొమ్మలను దూరం చేయాలి. మట్టి గణపయ్య తయారీకి అంకురార్పణ చేసిన సాక్షి మీడియాకు హ్యాట్సాప్.

– ఎ.రామారావు నాయుడు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈఈ శ్రీకాకుళం

5172 మందికి రూ.7.75 కోట్లు

- వరుసగా నాల్గో ఏడాది వైఎస్సార్ కాపునేస్తం నగదు విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: వరుసగా నాల్గో ఏడాది వైఎస్సార్ కాపునేస్తం నగదు విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమాన్ని వీక్షించారు. ఇక్కడి కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం ద్వారా 5,172 మంది లబ్ధిదారులకు రూ 7.7580 కోట్లు అందించినట్లు తెలిపారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల వయసు గల మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ ఏటా రూ.15వేలు చొప్పున ఐదేళ్లకు రూ.75వేలు అందజేస్తున్నట్లు వివరించారు.

- ఆమదాలవలస నియోజకవర్గంలో 509 మంది లబ్ధిదారులకు రూ.0.7635 కోట్లు
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో 1847 మంది లబ్ధిదారులకు రూ.2.7705 కోట్లు
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 606 మంది లబ్ధిదారులకు రూ.0.9090 కోట్లు
- నరసన్నపేట నియోజకవర్గంలో 287 మంది లబ్ధిదారులకు రూ.0.4305 కోట్లు
- పలాస నియోజకవర్గంలో 479 మంది లబ్ధిదారులకు రూ.0.7185 కోట్లు
- పాతపట్నం నియోజకవర్గంలో 545 మంది లబ్ధిదారులకు రూ.0.8175 కోట్లు



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న దృశ్యం

- శ్రీకాకుళం నియోజకవర్గంలో 419 మంది లబ్ధిదారులకు రూ.0.6285 కోట్లు
- టెక్కలి నియోజకవర్గంలో 480 మంది లబ్ధిదారులకు రూ.0.7200 కోట్లు
- మొత్తం జిల్లాలో మొత్తం 5,172 మంది లబ్ధిదారులకు రూ 7.7580 కోట్ల నగదును లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.
- కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ హైమావతి, బీసీ, కాపు కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఆర్.గెడ్డమ్మ, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పొందిన మేలు చెప్పుకోవాలి



మాది శ్రీకాకుళంలోని చాపలవీధి. సీఎం వైఎస్ జగన్ పేదలకు చేసిన మేలును లబ్ధిదారులు చెప్పుకోవాలి. ఇలాంటి సీఎం దొరకడం మహిళల అదృష్టం. సమాజంలో ఓ గౌరవ స్థానాన్ని కల్పించారు. – జ్యోతి, లబ్ధిదారు

ప్రతి పథకం అందుతోంది



మాది ఆమదాలవలసలోని ఊసవానిపేట. జగనన్న అందించిన ప్రతి పథకం నాకు అందుతోంది. ఆ డబ్బుతోనే నా పిల్లలను చదివించుకుంటున్నాను. సీఎం ప్రవేశ పెట్టిన పథకాలతో మహిళకు ఓ గౌరవం వచ్చింది. ప్రజల కష్టం తెలిసిన సీఎం దొరకడం మన అదృష్టం.

– శంఖు లక్ష్మి, లబ్ధిదారు, ఆమదాలవలస

అనంతరం అతిథులు లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు.

క్లుప్తంగా

పోర్టుఫోలియో జడ్జిని కలిసిన ఎస్పీ



పోర్టుఫోలియో జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, శ్రీకాకుళం జిల్లా జ్యుడీషియల్ పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని శనివారం ఎస్పీ జీఆర్ రాధిక మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు ఆవరణంలో జరగనున్న జ్యుడీషియల్ సమీక్ష సమావేశానికి వచ్చిన సందర్భంగా ఆయనను ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రారంభిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్ఎం పురం క్యాంపస్‌లో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్య అందిస్తామని చెప్పారు. రెసిడెన్షియల్ విద్యా విధానం కావటం వల్ల విద్యార్థులు శ్రమించి చదివేందుకు తగ్గ వాతావరణం ఉంటుందని అన్నారు. పీయూసీలో నాలుగు,ఇంజినీరింగ్‌లో ఎనిమిది సెమిస్టర్లలో మంచి ప్రతిభ ప్రదర్శించాలని అన్నారు. ట్రిపుల్ ఐటీలో కరిక్యులమ్ భిన్నంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ పాల్గొన్నారు.

జలయజ్ఞం కాలువలో నీటి గలగల



కొత్తూరు మండలం గుణభద్ర వద్ద రిజర్వాయర్ నుంచి వరద కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

కొత్తూరు: వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో వంశధార ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వరద కాలువల్లో వరద నీరు గలగలా పారుతోంది. ఒడిశాలో కురిసిన వానలకు వరద రావడంతో పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీరు చేరింది. అక్కడ నుంచి వరద కాలువ ద్వారా హిరమండలం రిజర్వాయర్‌కు నీరు చేరుతోంది.

'రాజ్యాంగ హక్కులను కాపాడాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజ్యాంగం కల్పించిన హక్కులు కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షుడు దుంపల రమణారావు, కార్యదర్శి డొంకాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రపంచ న్యాయ దినోత్సవం సందర్భంగా రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో 'భారత రాజ్యాంగం–ప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై చర్చను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, పౌర హక్కులు కాపాడాలన్నారు. చట్టాల్లో మార్పులు కాలానికి అనుగుణంగా ఉండాలని ఆకాంక్షించారు.

సోమవారం స్పందన లేదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినాయక చవితి సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు ఒక ప్రకటన విడుదల చేశారు.

పాఠశాల పనుల్లో అవకతవకలపై విచారణ

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతంలో జరిగిన నాడు–నేడు పనులపై విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుల మేరకు సర్వశిక్ష అభియాన్ ఇంజినీరింగ్ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. పీవీ రామరాజు హెచ్ఎంగా ఉన్న సమయంలో జరిగిన పనుల్లో అవకతవకలు జరిగాయని, టాయిలెట్ల నిర్మాణంలో అక్రమాలు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదుపై సర్వశిక్ష అభియాన్ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఈఈ వి.సతీష్, ఏఈ కామేశ్వరరావు, వీపీఏ రామారావులు విచారణ జరుపుతున్నారు. ప్రాథమిక విచారణ నివేదికల మేరకు త్వరలో సమగ్ర విచారణ చేపడతామని, బాధ్యులపై చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుత హెచ్ఎం వెంకటరావు విచారణలో పాల్గొన్నారు.

రైతు బాగుంటేనే మనం బాగుంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పక్కనే ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, పక్కనే ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్, జెడ్పీ సీఈఓ వెంకట్రామన్

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: రైతు బాగుంటేనే మనమంతా బాగుంటామని, రైతులకు ఎదురైన ప్రతి సమస్యను కూడా అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించేలా అధికారులు బాధ్యత వహించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి పలు శాఖల ప్రగతిపై సమీక్షించారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకూడదని, వ్యవసాయ శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. అలాగే జిల్లాలో సచివాలయాల్లో స్టాఫ్ లేని వాటిని గుర్తించి రేషనైలేజన్ ద్వారా సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం తరఫున కొనుగోలు చేస్తామని, మద్దతు ధరగా గ్రేడ్–1 రకం 100 కేజీల బస్తా వరి మద్దతు ధర రూ.2203, కామన్ రకం రూ.2183, అలాగే 80 కేజీల బస్తా అయితే రూ.1762, కామన్ అయితే రూ. 1746 చొప్పున నిర్ణయించినట్లుగా జేసీ ఎం. నవీన్ ప్రకటించారు. అలాగే పంట నమోదు చేసిన ప్రతి సెంటు భూమికి పంట బీమా వర్తిస్తుందన్నారు. అయితే ప్రతి రైతు ఇ–క్రాపింగ్ చేయించుకోవాలని, ఈనెల 30 వరకు గడువును పెంచారని, ఈ ప్రకారం అధికారులు శతశాతం ఇ–క్రాప్ చేయించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాతపట్నం హౌసింగ్‌పై త్వరలో సమీక్షించనున్నామని, ఇచ్ఛాపురంలో ఇసుక స్టాక్ పెడతామని మీటింగ్‌లో చెప్పి, ఇంతవరకు ఏం చేశారని మైన్స్ డిడిని ప్రశ్నించారు. వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే నందిగాం మండలంలో ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలపై తదుపరి మీటింగ్ లోపలే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్లు పాలిన శ్రావణి, సిరిపురపు జగన్మోహనరావు, బీసీ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, పేరాడ తిలక్, డీఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు కోనాడ నరిసింగరావు, డీసీఎంఎస్ చైర్మన్ జి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ కీలకం

రైతుల కోసం సీఎం వైఎస్ జగన్ ఆర్‌బీకేలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేయడానికి అధికారులు మరింత చిత్తశుద్ధి కనబర్చాలి. సాగు సమయంలోనే ధాన్యంతో పాటు ఇతర పంటల మద్దతు ధర ఎంత ఉందో తెలియజేయాలి.

– దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ.

తీర్మానం పంపించండి

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పాతపట్నం, పాలకొండ నియోజకవర్గాల్లో సొంత ఇంటి స్థలాల్లో ఇళ్ల నిర్మించుకునే వెసులుబాటు కలిగేలా జెడ్పీ నుంచి తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపించాలి. దీనిపై తక్షణమే స్పందించకపోతే ఇళ్ల నిర్మాణాలు ఆలస్యమవుతాయి.

– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాతపట్నం నియోజకవర్గంలో రెండో ఫేజ్‌లో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి. నియోజకవర్గానికి 10 వేల ఇళ్లను టార్గెట్‌గా అనుకున్నాం. అలాగే ఈ లేఅవుట్ల మౌలిక సదుపాయాలకు రూ.6.40 కోట్లుతో ప్రతిపాదించిన పనులు కూడా వేగంగా చేపట్టాలి.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

గడప గడపకూ వెళ్లాలి

ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు అవగాహన పెంచాలి. వ్యవసాయశాఖాధికారులు గడపగడపకూ వెళ్లి రైతులకు ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయో చెప్పాలి. పీఎం కిసాన్, పంట నష్టం, బీమా తదితర పథకాలపై చెప్పాలి. హౌసింగ్ పీడీ గిరిజనుల గృహ నిర్మాణాలు పరిశీలించాలి. ఎన్నికలు సమీపిస్తున్నాయి. అధికారులు స్పందించాలి.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే, పాలకొండ

తోటపల్లి నీరు శివారుకు అందాలి

తోటపల్లి కాలువల ద్వారా సాగునీరు రాజాం నియోజకవర్గంలో టెయిలెండ్ ప్రాంతాలకు అందడం లేదు. ఈ విషయాన్ని అధికారులకు ఎన్నో సార్లు చెప్పాం. అలాగే కాలువలను కూడా మరమ్మతు చేయాలి. అలాగే ప్రధాన రహదారుల మరమ్మతులపై కూడా దృష్టి సారించాలి.

– కంబాల జోగులు, ఎమ్మెల్యే, రాజాం.

ఇంకా ఎవరేమన్నారంటే..

- నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా కనీస చర్యలు తీసుకోలేదని అన్నారు.
- ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప మాట్లాడుతూ ఇచ్ఛాపురం మండలంలో సచివాలయ వ్యవస్థ దారుణంగా ఉందన్నారు. స్టాఫ్‌ను నియమించాలన్నారు.
- కంచిలి ఎంపీపీ దేవదాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు.
- రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం మాట్లాడుతూ పాతర్లపల్లి ఆర్బీకేలో సరిపడా సరుకు లేదన్నారు. ప్రైవేటు డీలర్లతో అధికారులు కుమ్మక్కై అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

ఫ్రేమ్‌లూమ్‌తో చీరలు నేసేందుకు శిక్షణ



చేనేత చీరలను పరిశీలిస్తున్న హేండ్లూమ్–టెక్స్‌టైల్ కమిషనర్ ఎం.ఎం.నాయక్

పొందూరు: ఫ్రేమ్‌లూమ్ మీద అధునాతన జాక్వార్ ఫాబ్రిక్‌తో చీరలు నేసేందుకు పొందూరు చేనేత కార్మికులకు త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నామని హేండ్లూమ్–టెక్స్‌టైల్ కమిషనర్ ఎం.ఎం.నాయక్ తెలిపారు. పొందూరు సాయిబాబా చేనేత సొసైటీని శనివారం సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పిట్ లూమ్ నుంచి ఫ్రేమ్ లూమ్‌కు కార్మికులు అప్‌డేట్ అవ్వాలని సూచించారు. పొందూరు ఖాదీ, చేనేతకు రాష్ట్రంలోను, ఢిల్లీలోను మంచి పేరు ఉందని చెప్పారు. కార్మికులకు వర్క్‌షెడ్ నిర్మాణాలు జరుపుకునేందుకు వ్యక్తిగతంగా నిధులు మంజూరు చేస్తానని అన్నారు. సొసైటీలో నూతన సభ్యులను చేర్చుకోవాలని సూచించారు. వారం రోజుల్లోగా నూతన సభ్యత్వాలను ఇచ్చి సమాచారాన్ని జిల్లా చేనేత, జౌళి శాఖ ద్వారా రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపించాలని సాయిబాబా చేనేత సొసైటీ మేనేజర్ వట్టం శ్రీనివాసరావుకు చెప్పారు. సొసైటీల్లో నూతన సభ్యులు పెరిగితే తద్వారా వస్త్రాల తయారీ పెరుగుతుందని, సొసైటీలకు ఆదాయం పెరుగుతుందని చెప్పారు. మాస్టర్ వీవర్స్‌కు మించి వస్త్రాల ఉత్పత్తి పెరిగితే చేనేత కార్మికులకు ఆదాయం పెరుగుతుందన్నారు. క్లస్టర్ బిల్డింగ్ పూర్తయ్యి సుమారు నాలుగేళ్లు గడిచినా ఇంకా వర్కింగ్‌లోకి రాలేదని, పరికరాలు ఇవ్వలేదని పలువురు కార్మికులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో క్లస్టర్ వివరాలు పూర్తిగా ఇవ్వాలని ఏడీ ఐ.ధర్మారావుకు సూచించారు. క్లస్టర్ బిల్డింగ్‌ను కార్మికులకు అప్పగించేలా కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. 50 ఏళ్లు దాటే వారందరికి పెన్షన్ కచ్చితంగా అందించాలని సూచించారు. మగ్గం ఉన్న చేనేత కార్మికులందరికీ నేతన్న నేస్తం అందించాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 74 క్లస్టర్లు ఉన్నాయని చెప్పారు. ఆయనతో పాటు సాయిబాబా చేనేత సొసైటీ చైర్మన్ చందన అసిరిబాబు, డీఎంఓ సోమేశ్వరరావు, కార్మికులు ఉన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



మంత్రి ధర్మాన చేతులమీదుగా పట్టాలు అందుకుంటున్న లబ్ధిదారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలస గ్రామంలో 50 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు పట్టాలు పొందిన వారంతా త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని రూ.500 కోట్లు ఖర్చుపెట్టి స్థలాన్ని కొనుగోలు చేసి పట్టణంలోని 12,500 మందికి పట్టాలు అందించినట్లు చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏనాడైనా ఒక్క సెంటు భూమి కూడా రాష్ట్రంలో ఎక్కడా కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరావు, బాణాల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రెండెకరాల నుంచి రెండు లక్షల కోట్లు

ఎలా సంపాదించారు..?

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



పలాసలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఎన్టీఆర్‌కు అల్లుడయ్యే సమయానికి చంద్రబాబు కేవలం రెండు ఎకరాల ఆసామి అని, నేడు రూ.రెండు లక్షల కోట్లకు అధిపతి ఎలా అయ్యారని రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. ఆయన శనివారం పలాసలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి సొమ్మును ఎలా వెనుకవేసుకోవాలో చూసుకున్నారే తప్ప ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. వైఎస్ జగన్, చంద్రబాబుకు మధ్య తేడాను ప్రజలు గుర్తించారని తెలిపారు. సంక్షేమ పథకాలకు నిధులు ఆపేయాలని చంద్రబాబు ప్రధాన మంత్రికి లేఖ రాశారని గుర్తుచేశారు. చంద్రబాబు రూ.370 కోట్లు తన ఖాతాలో వేసుకుని అడ్డంగా దొరికిపోతే చాలా మంది బాధపడిపోతున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి అయితే జైల్లో పెట్టకూడదా, మనం తప్పు చేస్తే జైల్లో పెట్టవచ్చు ఆయన తప్పు చేస్తే జైల్లో పెట్టకూడదా అని అన్నారు. న్యాయం, చట్టం అందరికీ సమానమని చట్టం తన పని తాను చేస్తుందని, ఎవ్వరు తప్పుచేసినా శిక్షించాల్సిందేనని అన్నారు. తప్పు చేసిన వారు ఆధారాలు చూపించి బయటపడాలే తప్ప అడ్డంగా దొరికిపోయి సెంటిమెంట్ కథలు వల్లించి విడిచిపెట్టేయమంటే ఎలా అని అన్నారు. నేరస్తుడికి మద్దతు తెలుపుతున్నారని టీడీపీ నాయకులపై విమర్శలు గుప్పించారు. రానున్న ఎన్నికలలో మరిన్ని డ్రామాలు వేస్తారని అన్నారు.

మంచికి.. చెడుకి తేడా గమనించండి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మొగిలివిల్లిపేటలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి: ప్రజలు మంచి పాలనకు, చెడ్డ పాలనకు తేడా గమనించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కోరారు. మహానేత ఆశయాల నుంచి పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆయన అన్నారు. ఆయన శనివారం చెల్లాయివలస సచివాలయ పరిధిలోని గంగివలస పంచాయతీలో మొగిలివిల్లిపేట, కొండలక్కివలస గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అందుతున్న పరిపాలనను, గతంలో చంద్రబాబు పరిపాలనతో పోల్చుకుని మంచికి, చెడుకు తేడాను మీరే గమనించాలని ప్రజలను కోరారు. తప్పు చేసిన వారు చట్టానికి దొరక్కుండా తప్పించుకోలేరని అన్నారు. అంతకు ముందు పార్టీ జెండాను మొగిలివిల్లిపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, ఎంపీడీఓ ఉప్రశ్రీ, డీటీ శ్రీనివాసరావు, ఎం.చిరంజీవి, మండలపార్టీ అధ్యక్షుడు కణితి క్రిష్టారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం

ఇచ్ఛాపురం: పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు(జాన్ డేవిడ్), వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటి సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ తెలిపారు. పట్టణంలోని క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యాలయంలో శనివారం పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. జిల్లా క్రిస్టియన్ మైనారిటి సెల్ అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 106 మంది పాస్టర్లకు గౌరవవేతనం అందించిందని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'తీరాన్ని కాపాడుకుందాం'



కవిటి: ఇద్దివానిపాలెం సముద్రతీరంలో స్వచ్ఛసాగర్ కార్యక్రమం

సోంపేట: సముద్ర తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ట్రీ ఫౌండేషన్ కన్వీనర్ సోమేశ్వరరావు అన్నారు. ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం బట్టిగళ్లూరు సముద్ర తీర ప్రాంతంతో శ్రమదానం నిర్వహించారు. బారువ బీట్ అధికారి సంతోష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామరాజు, విద్యార్థులు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దివానిపాలెంలో..

కవిటి: మన సముద్ర తీరాన్ని మనమంతా కాపాడుకుందామని గ్రామస్తులు నినదించారు. శుక్రవారం మండలంలోని ఇద్దివానిపాలెం సముద్ర తీరాన్ని మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్‌కోయిస్ సంస్థల సంయుక్త పర్యవేక్షణలో పరిశుభ్రం చేశారు. 60 మందితో మూడు గంటల పాటు శ్రమ దానం నిర్వహించారు.

అనుమతులు లేకుండా మందుల విక్రయం



పార్వతీశం ఇంటిలో అనుమతుల లేకుండా విక్రయిస్తున్న మందులు పట్టుకున్న అధికారులు

రణస్థలం: రణస్థలం జేఆర్ పురంలో నివాసం ఉంటున్న వీవీ పార్వతీశం అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా పశువుల మందులు విక్రయిస్తున్నాడని జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎస్. యుగంధరరావు తెలిపారు. జిల్లా ఔషధ నియంత్రణ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు జేఆర్ పురంలోని పార్వతీశం ఇంటిలో ఢిల్లీ సెంట్రల్ ఔషధ నియంత్రణ అధికారి డి.విజయ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ మందులను కొనుగోలు చేసి తదుపరి ప్రైవేటు సిక్కర్లు అతికించి విక్రయిస్తున్నట్లు చెప్పారు. పశువుల వైద్యానికి సంబంధించిన 9 రకాలైన నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వ మందులు ప్రైవేటు స్టిక్కర్లతో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. జిల్లాలోని కోటబొమ్మాళిలో ఒక పశువుల మెడికల్ షాపు యజమాని ఈ మందులపై ఢిల్లీ ఔషధ నియంత్రణ అధికారులకు కొన్ని రోజుల కిందట ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కర్నాటక స్టిక్కర్లతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. పార్వతీశంపై కేసు నమోదు చేశామని, తదుపరి చర్యల నిమిత్తం న్యాయస్థానానికి సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో రణస్థలం ఏడీఏ బి.దుర్గారావు తదితరులు ఉన్నారు.

ఓజోన్ పొర.. కాపాడుకుందాం రా!

ఓజోన్ డే సందర్భంగా విద్యార్థి లోకమంతా ఓ3 అంటూ ప్రదర్శనలు చేసింది. ప్రతి పాఠశాలలోనూ ఓజోన్ పొర ఆవశ్యకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పలాస ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులు ఇలా ప్రదర్శన చేశారు. – కాశీబుగ్గ



విద్యార్థిని ఆత్మహత్య



కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్న కూర్మాపు భాగ్యలక్ష్మి

నందిగాం: కడుపు నొప్పి తాళలేక మండలంలోని పెదలవునిపల్లికి చెందిన భాగ్యలక్ష్మి (17) అనే విద్యార్థిని శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నందిగాం పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. పెద్దలవునిపల్లికి చెందిన కూర్మాపు విష్ణుమూర్తి, శారద దంపతులకు ఒక కుమార్తె భాగ్యలక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. భాగ్యలక్ష్మి నందిగాం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీలో సెకండియర్ చదువుతుండగా కుమారుడు శ్రీకాకుళంలో పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్నాడు. భాగ్యలక్ష్మికి నెలసరిలో విపరీతమైన కడుపు నొప్పి వస్తుండడంతో రెండు రోజులుగా కాలేజీకి వెళ్లడం లేదు. శనివారం ఉదయం తల్లిదండ్రులు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి ఆమె ఉరికి వేలాడుతూ కనిపించడంతో నిశ్చేష్టులయ్యారు. కిందకు దించి చూసే సరికి ప్రాణాలు లేవు. మృతురాలి తండ్రి విష్ణుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అమీర్ అలీ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.